


# అపూర్వ సంగమం

**మన్నె సత్యనారాయణ**

అసలు ఆ ఇల్లు ఆ చుట్టుప్రక్కల వూళ్ళవారికో సంస్కార కేంద్రం లాంటిది. ఆ వూళ్ళలోని అన్ని కులాల వారూ హిందూ సాంప్రదాయ సంస్కారాలకు సంబంధించి ఏ సలహాలనైనా పండిత పరమేశ్వరశాస్త్రిగారి దగ్గరకొచ్చి అడిగి తెలుసుకుంటూ వుంటారు. ఆయన హిందూ పురాణ గ్రంథాలనూ, ధర్మశాస్త్రాలనూ జాగ్రత్తగా అధ్యయనం చేసారని అంటారు.

ఒకరోజున పరమేశ్వరశాస్త్రిగారితోపాటు మరో ఇద్దరు, ముగ్గురు వారి ఇంటి అరుగుమీద కూర్చుని వున్నారు. అప్పుడే ఓ కారొచ్చి వారింటి ముందాగింది. ఆ కారులోంచి వారి కుమారుడూ, ఓ అమెరికన్ యువతి దిగారు. ఆ రోజున కొడుకు అమెరికా నుంచి వస్తాడని, వాకిట్లో నిలబడి ఎదురుచూస్తున్నారు శాస్త్రిగారి భార్య ప్రభావతిగారు. కొడుకుతోపాటు తెల్లపిల్ల దిగడం చూసి గతుక్కుమన్నారావిడ. తండ్రికి అభివాదం చేసి, ఆ అమ్మాయితోపాటు లోనికెళ్లాడు కృష్ణశాస్త్రి.

"ఈవిడ మా అమ్మగారు" అని తల్లినామెకు పరిచయం చేసాడు. అమెరికా పద్ధతిలో "హౌడూ యు డూ?" అనలేదా అమ్మాయి. రెండు చేతులూ జోడించి నమస్కరించిందామెకు.

"ఈమె మార్గరెట్" అని తల్లికామెను పరిచయం చేసాడు.

'అమెరికావాళ్ళు కూడా ఇలాగే దణ్ణం పెడతారు కాబోలు' అనుకుందావిడ. 'కానీ ఈ లాగూ చొక్కాతో, పిలకలాంటి జుట్టుతో ఏవిటీ వాలకం' అనుకుందావిడ.

తల్లిని కాస్త ఎడంగా తీసుకెళ్ళి "అమ్మా, నీకు తర్వాతన్నీ చెబుతాను. ఈ అమ్మాయికో గది ఏర్పాటు చేయి" అన్నాడు.

'తర్వాత చెబుతానంటున్నాడు. ఏం చెబుతాడు?' అనుకుని కాస్త భయపడింది. "అలాగే" అంది.

ఓ గదిలోకి మార్గరెట్‌ను తీసుకెళ్ళింది.

"నీకు తెలుగు వచ్చునా అమ్మా" అనడిగిందావిడ.

"మాట్లాడిందర్థం చేసుకుంటాను. కొద్దిగా తెలుగు మాట్లాడగలను" అంది మార్గరెట్.

"అలాగా! మా వాళ్ళప్పుడు నాకు ఇంగిలీషు చెప్పించలేదు. చెప్పించి వుంటే, ఇప్పుడు నీతో ఇంగిలీషులోనే మాట్లాడుదును" అందావిడ అమాయకంగా.

"ఫరవాలేదులెండి. చక్కగా తెలుగులో మాట్లాడండి. అర్థం చేసుకుంటాను" నవ్వుతూ అంది మార్గరెట్.

"ఈ గదిలో వుండమ్మా. నీ సామానిక్కడ పెట్టిస్తా. ఇదిగో ఈ పక్కనే స్నానాలగది వుంది. ఈమధ్యనే కట్టించాం" అంది. "ఏం తీసుకుంటావమ్మా, కాఫీయా, టీయా?" అనడిగిందావిడ.

"మీ ఇంట్లో ఏది తీసుకుంటే అదే నాకివ్వండి"

'ఈ పిల్ల పద్ధతి కాస్త బాగానే వున్నట్లుంది' అనుకున్నారావిడ.

అరుగుమీదున్న మిగతావారిని పంపించి, పరమేశ్వరశాస్త్రిగారు లోపలి చావిడిలోకొచ్చారు. ఆయనెప్పుడూ కూర్చునే పెద్దకుర్చీలో కూర్చున్నారు.

"ఏవండీ, ఆ అమ్మాయెవరంటారు? వీడి కూడా వచ్చిందేవిటి?" అనడిగారాయన్ని ప్రభావతిగారు.

"చెబుతాడుగా, ఎందుకూ తొందర?" అన్నారాయన.

ఓ అరగంట తర్వాత వారి కుమారుడొచ్చి, కుర్చీ దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

"నాన్నా! ఆమె గురించి మీకు చెప్పాలి. ఆమె పేరు మార్గరెట్. అమెరికాలో ఓ సంపన్న కుటుంబానికి చెందినమ్మాయి. ఆమెకు మన హిందూమతమన్నా, భారతీయ కుటుంబ వ్యవస్థన్నా చాలా గౌరవం. నేనామెకు పరిచయం కాకముందునుంచే, ఆమె అక్కడున్న ఇండియన్ కుటుంబాలతో స్నేహం చేసేది. నేను పరిచయమయ్యాకా మన మతం గురించీ, సాంప్రదాయాల గురించీ నన్నడిగి తెలుసుకునేది. ఆమె మంచి వ్యక్తిత్వాన్ని చూసిన తర్వాత, ఆమెమీద నాకిష్టం కలిగింది. ఆమె కూడా హిందూ యువకుడినైన నన్ను చేసుకోవాలనుకుంది. అయితే నేను మీ అనుమతి తీసుకోవాలి. కానీ మీరొప్పుకోరు. నాకు తెలుసు. సాంప్రదాయాలనూ, ఆచారాలనూ నిష్ఠతో పాటించే మీరు మరో మతం అమ్మాయిని నేను చేసుకోవడానికి ఒప్పుకోరు. మీ అనుమతి నడిగి, మీరు కాదన్నాకా, ధిక్కరించి పెళ్ళి చేసుకోవడం అసలు మంచిది కాదు. అందువలన అక్కడే పెళ్ళి చేసుకుని తర్వాత మిమ్మల్ని బ్రతిమాలి ఏదోలాగున ఒప్పించుకోవాలనుకున్నాను. అంతకన్నా నాకు మార్గం కనిపించలేదు. ఆరు మాసాల క్రితమే పెళ్ళి చేసుకున్నాం. అమ్మాయి చాలామంచిది"

శాస్త్రిగారేం మాట్లాడలేదు.

"ఒరేయ్, ఏవిట్రా చెబుతున్నావు? నీ తండ్రిది నిప్పును కడిగిన వంశంరా! అటువంటాయనింట్లోకి మన మతంకాని, కులంకానమ్మాయిని కోడలిగా తీసుకొస్తావా? ఎలా కుదురుతుందనుకున్నావు?" అని ఆందోళనతో అన్నారు ప్రభావతిగారు.

"చిన్నప్పుడు నేనెన్ని తప్పులు చేసినా, మీరిద్దరూ క్షమించి మరచిపోయేవారు. ఇప్పుడు నేను తప్పుచేసానని అనిపించినా, అలాగే క్షమించండి. తల్లిదండ్రుల మనసుతో ఈ విషయాన్నాలోచించండి. మీతో వాదించను. ఏం చేస్తారో మీదే భారం. అంతకుమించి చెప్పలేను" అనేసి, లేచి వెళ్ళిపోయాడు.

పరమేశ్వరశాస్త్రిగారొక్క మాట కూడా మాట్లాడలేదు. మౌనంగా, గంభీరంగా వుండిపోయారు. ఆయన మనసులో బాధపడుతున్నారనిపించిందామెకు. ఆయన్ను కదపడం ఇష్టంలేక లోనికెళ్ళిపోయారావిడ.

ఓ అరగంటపాటు ఇంట్లో మౌనం. ప్రభావతిగారు తర్వాతొచ్చి భర్త కుర్చీ దగ్గర నేలమీద కూర్చున్నారు. ఇంతలో మార్గరెట్ గదిలోంచి వచ్చి వారి ముందు నిలబడింది. శాస్త్రిగారామెవంక ఆశ్చర్యంగా చూసారు. 'ప్రొద్దుట చూసినామేనా ఈ అమ్మాయి' అనుకున్నారు. ఆమె జరీ అంచు కాటన్ చీర కట్టుకుంది. దానికి తగిన జాకెట్ వేసుకుంది. తెల్లని ముఖానికి ముత్యమంత పసుపురేఖ పల్చగా రాసి స్నానం చేసింది. సాయంకాలం నీరెండలో మెరిసే హరితపత్రంలా తోచిందామె ముఖం. నుదుటిమీద కుంకుమబొట్టు. కొద్దిగా పెరిగిన జుట్టును ముడివేసింది. మెడలో మంగళసూత్రాలు, కాలికి మట్టెలు. భుజంమీదుగా చీరకొంగు కప్పుకుంది. వారిద్దరూ ఆశ్చర్యం నుండి తేరుకునే లోగానే ఆమె వంగి మావగారి పాదాలకు నమస్కరించింది. ఆయన ఆశీర్వదించారు. తర్వాత అత్తగారి పాదాలకు కూడా నమస్కరించింది. ఆవిడ 'శుభం' అన్నారు. మార్గరెట్ మళ్ళీ ఎడంగా నిలబడింది.

"కూర్చో అమ్మా" అని దగ్గర్లో వున్న కుర్చీ చూపించారు శాస్త్రిగారు.

ఆమె కుర్చీలో కూర్చోలేదు. వారికి దగ్గరగా నేలమీద కాళ్ళు ప్రక్కకు మడచుకుని కూర్చుంది.

"ఏమైనా చెప్పాలా అమ్మా" అనడిగారు శాస్త్రిగారు.

"అవునండీ! తెలుగు మాట్లాడితే బాగానే అర్థం చేసుకోగలను. కొంతవరకూ తెలుగు మాట్లాడగలను"

"అలాగా! సరే చెప్పు నీకొచ్చిన తెలుగులో"

"నా గురించి పరిచయాన్ని మీకు మీ అబ్బాయి చెప్పి



వుంటారు. హిందూమతం గురించి నాకు తెలిసి నప్పట్నుంచీ, ఆ మతంలోని తాత్విక భావన యందు నాకు గౌరవం కలిగింది. మరింత తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. హిందూ వివాహ కుటుంబ వ్యవస్థ ల్లోనూ భారతీయ జీవన శైలిలోనూ బలమైన 'బాండ్' (బంధం) భద్రతా ఉన్నాయని నాకర్థమైంది. అమెరికాలో వున్న కొన్ని ఇండియన్ కుటుంబాలతో స్నేహం చేసాను. వారిలో ఎక్కువ మంది తెలుగువారే! ఇది యాదృచ్ఛికం మాత్రమే. వారి భాషను కూడా నేర్చుకోవాలనిపించింది. వారు మాట్లాడుకుంటుండగా విని కొంతా, వారిని నేర్పమని కొంతా నేర్చుకున్నాను. సరస్వతి అనే ఆవిడ నాకు తెలుగు చదవడం, వ్రాయడం కొంత నేర్పారు. ఇంతలో మీ అబ్బాయి పరిచయమయ్యారు. ఆయన నేనంటే ఇష్టపడుతున్నారని అర్థమైంది. నాకు కూడా ఆయనంటే ఇష్టం కలిగింది. అప్పుడు నాలో చిన్న ఆశ కలిగింది. ఆయనను పెళ్ళిచేసుకుని ఒక సాంప్రదాయ హిందూ కుటుంబంలో కోడలిన వ్వాలనిపించింది. ఆరుమాసాల క్రితం అమెరికాలో ఒక హిందూ దేవాలయంలో మేం పెళ్ళి చేసుకున్నాం. అక్కడి కొందరు ఇండియన్స్ పెళ్ళి జరిపించారు. సర్! మీరు గొప్ప పండితులని విన్నాను. మీకు చెప్పడానికి తగిన దాన్ని కాదు. మనుషులందరూ భగవంతునిచేత సృష్టింపబడినవారే కదా! అందుకే మనుషులందరూ ఒకే జాతి. రంగుల్లో తేడాలుండవచ్చును. మానవజాతి అంతా ఒక్కటే. దేవుడు కూడా ఒక్కరే! వారిని ఒకో మతంలో ఒకో పేరుతో పిలుస్తున్నాం. ప్రాంతాలనుబట్టి కొంత భిన్నమైన ఆచారాలు అలవాటయ్యాయి. ఈ పెళ్ళి మా తల్లిదండ్రులకిష్టంలేదు. వేరే మతం వారిని చేసుకుని నేను అమెరికా విడిచి వెళ్ళడానికి వారు ఒప్పుకోలేదు. కానీ నేను నా మార్గాన్నే ఎంచుకున్నాను. ఇక్కడకు నేను విశ్వాసంతో వచ్చాను. మీది ఉత్తమ సంస్కారం కలిగిన కుటుంబమని తెలిసింది. మీ ఉత్తమ సంస్కారాన్ని ఏ విధంగానూ కలుషితం కానివ్వను. క్రమశిక్షణతో మిమ్మల్ని అనుసరిస్తాను"

కొద్దిసేపు వారి మధ్య నిశ్శబ్దం నెలకొంది.

"ఒకవేళ మీరు నన్నంగీకరించకపోయినా కూడా తిరిగి నేను మా దేశం వెళ్ళను. మీ ఇష్టానికి వ్యతిరేకంగా మీ ఇంట్లోనూ వుండను. భారతదేశంలో ఎక్కడో చోట నా జీవితాన్ని గడిపేస్తాను" అని చెప్పి మౌనంగా కూర్చుంది.

శాస్త్రిగారేం మాట్లాడ్డం లేదు. గంభీరంగానే కూర్చున్నారు. భర్త ఏం చెప్పలేక అలా వుండిపోయారని ప్రభావతిగారు అర్థం చేసుకున్నారు.

"అమ్మాయ్! నీవు చెప్పిందంతా బాగానే వుంది. నిజం కూడా అంతే! కానీ ఎన్నో తరాల నుంచీ మేమీ సాంప్రదాయాలకూ, అనుష్ఠానానికీ బద్ధులమై వున్నాం. వీటినన్నింటినీ వదిలి వేరే మతం అమ్మాయివైన నిన్నెలా మాలో కలుపుకోగలం? ఈయన ఎందరికో మార్గదర్శకంగా వుంటారు. తాను కులం తప్పి, ఇతరులకెలా చెప్పగలరు? ఇదెలా వీలవుతుందమ్మా" అన్నారు ఆందోళనతో ప్రభావతిగారు.

"ప్రభావతీ! నీవన్నవన్నీ వాళ్ళు పెళ్ళిచేసుకోవడానికి ముందు చెప్పవలసిన మాటలు. అప్పుడు మనకా అవకాశం లేదు. ఇప్పుడు ఈ అమ్మాయి మన కోడలు. ఈమెను మనతో సమానంగా మనం ఆదరించాలి" అన్నారు నిశ్చయంతో శాస్త్రిగారు.

ఆమె భర్తవంక విస్మయంతో చూసింది. 'ఏవిటీ! ఇంతటి నిష్ఠాపరుడు, ఈ అమ్మాయిని కోడలుగా స్వీకరిస్తారా!' అని ఆశ్చర్యపడింది. కానీ బదులు చెప్పలేదు.

మార్గరెట్ మనసు సంతోషంతో నిండిపోయింది. కృతజ్ఞతతో మావగారి పాదాలను స్పృశించి, నమస్కరించి తన గదిలోకి వెళ్ళిపోయింది. కొద్ది క్షణాలు వారిద్దరూ మౌనంగా వున్నారు. "ఏవండీ, ఏమిటి మీరంటు

న్నది? ఆచారంలో, అనుష్ఠానంలో కొద్దిపాటి అజాగ్రత్త జరిగినా కూడా మీరు రాజీపడలేరు కదా! ఈ అమ్మాయిది మన మతం కాదు, మన కులం కాదు. మన దేశం కూడా కాదు. ఈమెను కోడలుగా అంగీకరిస్తున్నారు. ఇతరులకేం చెబుతారు?" అన్నారు ప్రభావతిగారు.

"నిజమే. కానీ కులం, మతం, దేశం, ఇతరుల మాటలు- వీటన్నింటికంటే కూడా జీవితం ముఖ్యం. ఈ అమ్మాయి మన అబ్బాయి చేతుల్లో తన జీవితాన్ని పెట్టి తల్లిదండ్రుల్నీ దేశాన్నీ విడిచి మనింటికొచ్చింది. ఆ అమ్మాయిని ఆదరించాల్సిన బాధ్యత మనదే! మానవత్వానికి మించిన మేలు ఎక్కడా లేదు. ఆమెను కోడలుగా అంగీకరించు. జాలితో కాదు, ఆమెనుద్ధరిస్తున్నామనే ఉదార భావంతో కాదు. ఈ ఇంటిలో ఆమె మనతో సమానురాలనే అంగీకారంతో ఆదరించు. ఆమెకు మన పద్ధతులను నేర్పు. ఒకవేళ ఆమె ఎప్పుడైనా తన పద్ధతిలో నడుచుకున్నా కూడా అభ్యంతరం పెట్టకు. ఆ స్వేచ్ఛను ఆమెకివ్వు. స్వేచ్ఛ జీవ మనోధర్మం!" అన్నారాయన.

ఈ సంగతి క్షణాల మీద వూరంతా తెలిసిపోయింది. 'పరమేశ్వర శాస్త్రిగారబ్బాయి ఓ అమెరికా అమ్మాయిని పెళ్ళాడి తీసుకొచ్చాడుట' అనే మాట అనేక రూపాంతరాలు, కథలుగా మారి అరగంటలో వూరంతా తెలిసింది. పల్లెటూళ్ళలో అంతే! ఆడవాళ్ళు ముగ్గురేసి, నలుగురేసి కలిసి ఆ అమ్మాయిని చూద్దానికొస్తున్నారు. ఆడవాళ్ళు ఆమెనెన్నో ప్రశ్నలడిగేవారు. ఆమె ఓపికతో సమాధానం చెప్పేది.

అయితే వాళ్ళతో మాట్లాడటాన్ని తెలుగు నేర్చుకోవడానికో అవకాశంగా మలచుకుందామె. ఆ ఆడవాళ్ళు మాట్లాడే వ్యవహారిక తెలుగు మాటల నుడికారాలూ, సామెతలూ మొదలగువాటిని పరిశీలించి గ్రహించేది.

ఇలాగే కొన్ని రోజులపాటు ఆడవాళ్ళు వచ్చి చూసి మాట్లాడి వెళ్ళేవారు. "పిల్ల మంచిది. ఎక్కడా గర్వం లేదు. ఏ దేశమైతేనేం? పద్ధతైనదే" అని చెప్పుకోసాగారు.

వసంత అనే అమ్మాయి మార్గరెట్‌కు చనువయ్యింది. ఆమెకు పద్దెనిమిదేళ్ళు. పదవ తరగతి పాసై, తండ్రి వద్దంటే చదువు మానేసింది. వసంత సహాయంతో ఆమె తెలుగు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంది.

"తెలుగు వర్ణక్రమం కొంచెం కష్టం. అందుకే ఈ భాష అంతా సమగ్రమయ్యింది" అంది వసంతతో.

ఆ వూళ్ళోని వారిళ్ళల్లో ఫంక్షన్లు జరిగితే ప్రభావతిగారితోపాటు మార్గరెట్‌ను కూడా పిలిచేవారు. తాను వెళ్ళకుండా, కోడల్ని పంపేవారావిడ. అలా వెళుతుంటే అందరూ పరిచయమవుతారనీ, అక్కడి పద్ధతులామెకి అర్థమవుతాయనీ అలా పంపేవారు. అక్కడన్నీ పరిశీలించేదామె.

ఆమె అక్కడివారితో అలా కలిసిపోతుండగా, కృష్ణశాస్త్రికి కలకత్తాలో ఉద్యోగం వచ్చింది. ఎక్కువ జీతంతో, సదుపాయాలతో మంచి ఉద్యోగం.



తమ కొడుకూ, కోడలూ ఇంట్లో వుంటూ వుంటే, ఎంతో నిండుగా వుందనిపిస్తోంది ప్రభావతిగారికి. ఇప్పుడు వాళ్ళు కలకత్తా వెళ్ళిపోతారంటే ఆమెకు బాధగా అనిపించింది. ఆ మాటే భర్తతో అన్నారావిడ.

"ఉద్యోగం మంచిది. వాణ్ని చదివించింది అందుకే కదా!" అన్నారాయన.

అత్తగారు, మావగారు, భర్త చావిడిలో కూర్చుని వుండగా మార్గరెట్ అంది.

"ఉద్యోగం కోసం మనం వెళ్ళిపోతే అత్తగారికీ మావగారికీ తోడెవరుంటారు? ఈ వయసులో వారినొదిలి వెళ్ళడం మంచిది కాదు. ఆర్థికంగా అవసరమైతే వెళ్ళక తప్పదు. కానీ మీ నాన్నగారికి సరిపడినంత ఆస్తి వుంది. అమెరికాలో నా అక్కౌంటులో డబ్బుంది. మీరు సంపాదించకపోయినా లోటుండదు. అలా అని ఖాళీగా వుండమని కాదు. ప్రక్క టౌన్‌లో రెండు, మూడు ప్రైవేట్ కాలేజీలున్నాయని విన్నాను. అక్కడ లెక్చరర్‌గా చేరండి. జీతమెంతిచ్చినా ఫర్వాలేదు. ఇంటి దగ్గర్నుంచే రోజూ వెళ్ళవచ్చును" అంది.

ఆమెవంక శాస్త్రిగారు ఆశ్చర్యంగా చూసారు. 'అమెరికాలో నగర వాతావరణంలో పుట్టిపెరిగిన అమ్మాయేనా ఇలా మాట్లాడుతున్నది' అనుకున్నారు.

"అవున్రా, అమ్మాయి చెప్పిందే నిజం. అలా నేనాలోచించలేదు. అమ్మాయి చెప్పినట్లుగా చేయి. అందరం ఒక చోటనే వుందాం" అన్నారు.

ప్రభావతిగారు సంతోషపడ్డారు. కోడలికి దగ్గరగా జరిగి కూర్చుని చిన్నపిల్లను హత్తుకున్నట్లుగా దగ్గరకు తీసుకుని అన్నారు. "ఎంత మంచిమాట చెప్పావమ్మా! ఒరేయ్ కృష్ణా! నీవు కలకత్తా వెళ్ళొద్దు. అమ్మాయి చెప్పినట్లు చేయి" అన్నారు.

ఆ ముగ్గురి మాటలకూ కృష్ణశాస్త్రి ఒదగవలసి వచ్చింది.

★ ★ ★

ఒకనాడు దేవుని ఉత్సవం సందర్భంగా ఆ వూళ్ళో తోలుబొమ్మలాట ఆడుతున్నారు. వసంతను తోడిచ్చి చూడమని అత్తగారు పంపించారు. కరణంగారి

## హన్సిక రూటే వేరు

కుర్రహీరోయిన్ హన్సిక ఈమధ్య తన కొత్త సినిమాల గురించి ఏమాత్రం నోరు మెదపడం లేదు. కారణం ఏంటంటే- ఏదయినా సినిమా తను చేయబోతున్నట్టు గొప్పకోసం నలుగురికీ చెప్పుకున్న తర్వాత, ఏదో ఓ కారణంతో ఆ సినిమా చాన్స్ కాస్త చేజారిపోతోందిట. అలాంటప్పుడు ఇన్సల్టింగ్‌గా వుంటుంది కదా! అందుకనే తను నటించే సినిమా షూటింగ్ మొదలయ్యే వరకూ ఆ సినిమా గురించి ఎవరి దగ్గరా మాట్లాడకూడదని నిర్ణయించుకుందిట. బానే వుంది, కానీ షూటింగ్ మొదలయ్యాక కూడా ఏవైనా గొడవలొచ్చి సినిమా కాన్సిల్ కాకూడదనే గ్యారంటీ ఏమైనా వుందా అని డౌటు పడుతున్నారు కొంతమంది సందేహాలావులు.

అరుగుమీద కూర్చుని, కరణంగారి భార్య, వసంతలతో కలిసి ఆ ఆటను చూసింది మార్గరెట్. కేవలం రోడ్డుమీద, నాలుగు రాటల పందిరేసి, చుట్టూ తెరలు కట్టి, ఏ ఆధునిక సాంకేతిక సహాయమూ లేకుండా వాళ్ళు ప్రదర్శించిన ఆ తోలుబొమ్మలాటను చూసి, ఆమెకాశ్చర్యం కలిగింది. ఆ బొమ్మల ప్రత్యేకమైన రూపాలూ, వాళ్ళాడిస్తున్న విధానమూ, వాటి తీవీ, అవి ఆడుతున్న విధానమూ జీవిత తత్వాన్ని ప్రతిబింబించినట్టుగా తోచిందామెకు. ఆ మర్నాడు ఆ కళాకారులను ఇంటికి పిలిపించి, మావగారిచేత వాళ్ళకు ఓ వెయ్యి రూపాయలిప్పించింది. వాళ్ళెంతో సంతోషించారు.

ఒకనాడు గుడిలో దేవుని ఉత్సవం జరుగుతోంది. మిగిలిన ఆడవారితోపాటు మార్గరెట్ కూడా పూలపళ్ళెం తీసుకుని గుడికి వెళ్ళింది. పూజారిగారు, “అమ్మా మీరు గుడిలోకి రాకూడదు. హిందువుకు మాత్రమే దేవాలయంలోకి ప్రవేశించే అర్హత వుంటుంది” అన్నారు.

“ఇప్పుడు నేను హిందువునే. పరమేశ్వరశాస్త్రిగారి కోడల్ని” అంది.

“నిజమే కావచ్చును. కానీ పుట్టుకతో హిందువులైనవాళ్ళు మాత్రమే గుడిలోకి రావాలి” అన్నారాయన.

దగ్గర్లో వున్న నలుగురైదుగురు యువకులు వచ్చి “పూజారిగారూ! మనకంటే నిష్ఠతో మన మతాన్నావిడ అనుసరిస్తున్నారు. ఆవిడను లోపలికెళ్ళనిచ్చి దైవదర్శనం చేసుకోనివ్వండి” అన్నారు.

“మీరు నాకు అన్నదమ్ముల వంటివారు. పూజారిగారికి సరిగా ధర్మం అర్థంకాలేదనుకుంటాను. ఆయనకర్థమై అనుమతించినప్పుడే నేను లోనికి వెళతాను. మీ మంచితనానికి కృతజ్ఞురాలను” అని మార్గరెట్ ఇంటికి వెళ్ళిపోయింది.

ఓనాడు కృష్ణశాస్త్రి కొద్దిగా తాగి వచ్చాడు. మార్గరెట్‌కర్థమైంది. “ఇదివరలో మీకు రెండు మూడుసార్లు చెప్పాను త్రాగొద్దని. ఇది మంచిది కాదు” అంది కాస్త చిరాకుగా.

“నీకు చాదస్తం మరీ ఎక్కువ అవుతోంది. అమెరికాలో వుండగా నాకిది మామూలే” అన్నాడతను.

“అమెరికా వేరు. ఇది మీ నాన్నగారిల్లు. ఇక్కడ పవిత్రతా, పరిశుభ్రతా వుంటాయి. వాటిని కలుషితం కానివ్వడానికి వీల్లేదు” అంది.

కృష్ణశాస్త్రి మాట్లాడలేకపోయాడు.

ఈ విధంగా ఆమె మనసూ, అనుసరణా క్రమంగా భారతీయమవుతున్నవి.

మార్గరెట్‌ను కోడలిగా అంగీకరించి ఇంట్లో పెట్టుకోవడాన్ని ఆ వూళ్ళోని, చుట్టుప్రక్కల గ్రామాల్లోని బ్రాహ్మణులు అంగీకరించలేకపోతున్నారు. వారంతా కూడబలుక్కుని శాస్త్రిగారింటికొచ్చారు.

“మీరన్నీ తెలిసినవారు. అటువంటి మీరే ఓ విదేశీ క్రిస్టియన్ అమ్మాయిని కోడలిగా ఇంట్లో పెట్టుకుంటే, బ్రాహ్మణకులానికి సంబంధించిన ఆచారాలూ, సంస్కారాలూ కలుషితమవుతాయి కదా! బ్రాహ్మణులంతా దీన్ని నిరసిస్తున్నారు” అన్నారు వారిలో పెద్దాయన.



శాస్త్రిగారు ఓ నిమిషం మౌనంగా వున్నారు. తర్వాత నెమ్మదిగా అన్నారు.

“మన మతం సంస్కారాల గురించి ఇంతవరకూ ఏం చెప్పానో ఇప్పుడూ అదే చెబుతాను. వాటితోపాటు మానవత పాటించవలసిందే. ఈ రెండూ ముఖ్యమే! అయితే ఈ రెండింటికీ మధ్య ఎప్పుడైనా సంఘర్షణ ఏర్పడి, ఈ రెంటిలో ఒకదాన్ని మనం ఎంచుకోవల్సి వస్తే, మనం పాటించవల్సింది మానవతాధర్మాన్నే! ఆ మానవతా ధర్మంతోనే నేనూ, నా భార్య ఆమెను కోడలిగా అంగీకరించాం. అయితే మా నమ్మకాన్ని ఎప్పుడూ ఆమె వమ్ము చేయలేదు. చాలా క్రమశిక్షణతో, మన ఆచారాలనూ సాంప్రదాయాలనూ అనుసరిస్తోంది. దీనివలనే శుచి, శుభ్రతా, సంస్కారమూ ఏర్పడతాయి. అసలు మన అనుష్ఠాల ముఖ్య లక్ష్యమిదే! నా అభిప్రాయంలో ఆమె ఇప్పుడొక స్వచ్ఛమైన హిందువు” అని కచ్చితంగా, ఏ సంశయాన్ని మిగల్చకుండా చెప్పారాయన.

“కానీ ఆమె బ్రాహ్మణకుటుంబంలో పుట్టలేదు. పుట్టుకతో హిందువు కాదు” అని నసిగారొకాయన.

అప్పుడు మార్గరెట్ బైటకొచ్చింది. వారందరికీ నమస్కరించింది. “మీరంతా పెద్దలు. ఇది నాకు సంబంధించిన విషయం కనుక మీ ముందు నిలబడి మాట్లాడుతున్నాను. మన్నించండి. హిందూమతం అంటే విశ్వాసంతో ఇక్కడివారితో కలిసి జీవించడానికి ఈ దేశం వచ్చాను. నా అత్తమామలు నన్ను కన్నబిడ్డకంటే ఎక్కువ ఆదరణతో చూస్తున్నారు. వారి కులానికీ, కుటుంబానికీ సంబంధించిన ఆ సంస్కారాలను క్రమశిక్షణతో పాటిస్తున్నాను. వాటినెప్పుడూ కలుషితం కానివ్వను. ఇతర మతాలవారు పనికట్టుకుని ప్రచారం చేసి వారి మతాలలో కలుపుకుంటున్నారు. హిందూమతం విశిష్టమైనది. ప్రపంచ ప్రజల్ని ఆహ్వానించి, ఈ మతాన్ని విశ్వవ్యాప్తం చేస్తారో లేక ఈ మతం ఈ దేశానికి మాత్రమే పరిమితమనుకుని కుంచింపచేస్తారో మీ ఇష్టం” అని వారందరికీ మరోసారి నమస్కరించి లోనికెళ్ళింది మార్గరెట్.

## తమన్నా చిలకపలుకులు

**త**మన్నాకి ‘హ్యాపీడేస్’ తర్వాత అవకాశాలు వచ్చిపడినా చెప్పుకోదగిన హిట్టు మాత్రం లేదు. ఆమె తాజా చిత్రం ‘కొంచెం కష్టం-కొంచెం ఇష్టం’ విజయంతో కొత్త ఉత్సాహం వచ్చినట్టయింది ఈ గ్లామరస్ గాళ్‌కి. ఈవిడ అంటుందీ- ఏదయినా కష్టపడితేనే సాధించగలం అనే భావన వున్నా ‘అదృష్టం’ కూడా కలిసి రావాలి లేదంటే ఎంత కష్టపడినా ఫలితం వుండదు. అలాగని కేవలం అదృష్టం మీదే ఆధారపడితే లాభం లేదు. కాస్త కష్టం కూడా పడాల్సిందే’ అంటుందీ భామ. ఎంతయినా మాటలు నేర్చిన చిలక బాగానే పలుకుతోంది కదా!